రెవెన్యూ సదస్సులో 173 అర్జీలు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 15 గ్రామాల్లోని రెవెన్యూ సదస్సుల్లో 173 అర్జీలు స్వీక రించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని ఎస్.లింగందిన్నెలో 3, పొనకలదిన్నెలో 6, పెసల దిన్నెలో 12, జుమాలదిన్నెలో 24, రౌడూరులో 28, కాచాపురంలో 1, హెచ్. మురువణిలో 39, దిబ్బనకల్లులో 6, లింగదహాల్‌లో 8, కర్నూలు డివిజన్‌లోని పందిపాడులో 4, దిగువపాడులో 10, పత్తికొండ డివిజన్‌లోని దేవన బండలో 5, ఎ స్.హెచ్.ఎర్రగుడిలో 15, మరకట్టులో 6, బనవనూరులో 6 అర్జీలు వచ్చాయన్నారు.

సావిత్రీబాయి పూలే సేవలు ఎనలేనివి

ఎంపీ బస్తిపాటి నాగరాజు



సావిత్రీబాయిపూలే దంపతుల విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయి పూలే చేసిన సేవలు ఎనలేనివని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం కర్నూలు బీక్యాంపు బీసీ భవన్ ప్రాంగణంలో ఎంపీ నాగరాజు, బీసీ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బానిసత్వం నుంచి మహిళల విముక్తి, విద్య కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు రెసిడెన్షియల్ స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో కురువ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు కె.రామకృష్ణ, విజయకుమార్, శాలివాహన సంక్షేమ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాంబాబు, నాగరాజు, పీజీ వెంకటేశ్, తెలుగు మహిళ నాయకురాలు పార్వతమ్మ, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఫార్మాసిస్టు పోస్టులకు నోటిఫికేషన్

కర్నూలు హాస్పిటల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కడప జోన్-4 పరిధిలో 15 ఫార్మాసిస్టు కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు కడప రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి. రామగిడ్డయ్య ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తు నమూనా, ఇతర వివరాలను Http://cfw.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని, అభ్యర్థులు దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. భర్తీ చేసిన దరఖాస్తులను నిర్దేశించిన రుసుంతో పోస్టుకు సంబంధించిన సర్టిఫికెట్లను జతపరిచి ఈ నెల 4వ తేదీ నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను రీజనల్ డైరెక్టర్, వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం, కడప అందజేయాలని కోరారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతి కళ కోరారు.

నాటకరంగానికి ఆదరణ

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- ముగిసిన రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు

6



మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్




బీ క్యాంప్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

- నేటి నుంచి జిల్లాలో 23 కాలేజీల్లో 8,679 మంది విద్యార్థులకు లబ్ధి
- కర్నూలులో ప్రారంభించనున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా ఈ పథకాన్ని నిర్వహిస్తున్నారు. ఈ పథకాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. 2019 సంవత్సరం కంటే ముందు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం పాఠశాలలతో పాటు ఇంటర్ ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు అందించేవారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన పథకం కళాశాలల్లో అమలుకు మంగళం పాడింది. అప్పటి నుంచి కళాశాలల్లో చదివే పేద విద్యార్థులు ఆకలితో అలమటించారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 4వ తేదీన విజయవాడలోని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.



మెనూ వివరాలు ఇవే

వారంలో ఆరు రోజులు జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తారు. సోమవారం వేడి వేడి పొంగలి, బాయిల్డ్ ఎగ్, పలావ్ విత్ ఎగ్ కర్రీ, చిక్కి ఇస్తారు. మంగళవారం రాగి జావ, చింతపండు లేదా లెమన్ రైస్ (పులిహోరా), టమోటా-దొండకాయ కర్రి, చెట్నీ లేదా బాయిల్ ఎగ్ ఇస్తారు. బుధవారం వెజిటెబుల్ రైస్, ఆలూ కూర్మ, బాయిల్డ్ ఎగ్, చిక్కి, గురువారం రాగిజావ, సాంబర్ బాత్, బాయిల్డ్ ఎగ్. శుక్రవారం రైస్, ఆకుకూర పప్పు, బాయల్డ్ ఎగ్, చిక్కి, శనివారం రాగిజావ, గ్రీన్‌లీఫ్ వెజ్ రైస్, పప్పు, చారు లేదా స్వీట్ పొంగలి అందిస్తారు.

జిల్లాలో 8679 మంది విద్యార్థులకు లబ్ధి

కర్నూలు జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 8679 మంది విద్యార్థులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులంతా పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలే. గ్రామీణ విద్యార్థులు ఇంట్లో చద్దన్నం, టిఫిన్ తిని ఆఘమేఘాల మీద ఉదయం 9 గంటలకే కాలేజీకి వస్తున్నారు. ఆ టయానికి వంట కాకపోతే మధ్యాహ్న భోజనానికి బాక్సులు తెచ్చుకోలేకపోతున్నారు. కాలేజీ నుంచి ఇంటికి వెళ్లాక భోజనం చేయాల్సి వస్తోంది. ఇప్పుడు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం తీసుకరావడంతో విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి. విద్యార్థుల హాజరు శాతం కూడా పెరిగే అవకాశం ఉంది. చదువుపై దృష్టి పెట్టడంతో వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగే అవకాశం ఉందని అధ్యాపకులు, విద్యావేత్తలు అంటున్నారు.

ఎయిడెడ్ కళాశాల విద్యార్థులకు మొండిచేయి

ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో అమలు చేయదల్చుకోలేదు. ఇక్కడ చదివేది పేద విద్యార్థులే. గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలలతో పాటు ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అమలు చేసింది. ఈసారి ఎయిడెడ్ కాలేజీలను పక్కన పెట్టింది. జిల్లాలో 4 ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో 1069 మంది విద్యార్థులు ఇంటర్, ప్రథమ ద్వితీయ సంవత్సరాలు చదువుతున్నారు. ఈ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసి ఉంటే పేద విద్యార్థులకు ప్రయోజనం ఉండేది అని విద్యావేత్తలు భావిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి



ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం అమలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. బియ్యం, గుడ్లు తదితర సామగ్రి, తయారీకి వంట పాత్రలు సరఫరా చేశాము. కళాశాలల సమీపంలోని పాఠశాలల వంట ఏజెన్సీలకే ఈ పని అప్పగించాం. ఈ పథకానికి అవసరమయ్యే హెడ్ కుక్, అసిస్టెంట్ల కుక్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

- శామ్యూల్ పాల్, జిల్లా విద్యాశాఖ అధికారి

ఎయిడెడ్ కళాశాలలో కూడా అమలు చేయాలి



ప్రభుత్వ కళాశాలలతో పాటు ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో కూడా మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలి. ఈ కళాశాలల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులే ఉన్నారు. నిర్వీర్యమవుతున్న ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం సరఫరా చేస్తే పేద విద్యార్థులకు కొంత ఊరట కలుగుతుంది. దీంతో అడ్మిషన్లు పెరుగుతాయి.

- రాజేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి

కర్నూలు నగరంలో ప్రారంభించనున్న రాష్ట్ర మంత్రి టీజీ భరత్



కర్నూలు నగరంలో శనివారం ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాల, కేవీఆర్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాతనగరం ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర పరిశ్రమల, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభిస్తారు. ప్రతి కళాశాలలో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రారంభించేందుకు ఆహ్వానాలు పంపించాం. మొదటి రోజు ఈ పథకాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం.

-వై. పరమేశ్వరరెడ్డి, డీవీఈవో

రైతులకు మోదీ ఆసరా

- డీఏపీ ధర పెరగకుండా కేంద్రం నిర్ణయం
- పంటల బీమా పథకాలకు నిధులు



కర్నూలు అగ్రికల్చర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల రైతులకు ఊరట కల్పించే నిర్ణయాలు తీసుకుంది. అందులో ముఖ్యమైనది పీఎం కిసాన్ సమ్మాన్ పథకం. ఈ నిర్ణయం వారం కింద తీసుకుంది. ఇప్పటి దాకా ఏడాదికి రూ.6వేలు ఇస్తున్న పెట్టుబడి సాయాన్ని రూ.10వేలకు ప్రధాని నరేంద్ర మోదీ పెంచారు. దీంతో రైతులకు చాలా ఊరట కలగింది. రెండు రోజుల క్రితం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో డీఏపీపై వన్‌టైమ్ స్పెషల్ ప్యాకేజీ పొడిగింపునకు ప్రధాని నరేంద్రమోదీ ఆమోదం తెలిపారు. కొత్త సంవత్సరం ప్రారంభంలోనే కేంద్రం తీసుకున్న నిర్ణయంపట్ల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పంటల బీమా పథకాలైన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), అదే విధంగా సవరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలకు కేటాయింపులను పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకాలకు 2021 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు రూ.66,550 కోట్లు కేటాయించగా.. దాన్ని 2021-22 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరాలకు గాను రూ.69,515.71 కోట్లకు పెంచింది. దీంతో 2026 వరకు రైతులకు ఈ బీమా పథకాల ద్వారా ఎక్కువ ప్రయోజనం అందనుంది. రైతులు చెల్లించాల్సిన ప్రీమియం కూడా తగ్గిపోనుంది. ఈ బీమా పథకాల ద్వారా ఇప్పటి దాకా వ్యవసాయ శాఖ యంత్రాంగం ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను నివారించేందుకు మరో రూ.821.77 కోట్లతో ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీని అభివృద్ధి చేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ టెక్నాలజీ వల్ల పంట నష్టం అంచనాలను ఏ మాత్రం ఆలస్యం లేకుండా త్వరితగతిన తెలుసుకోవడంతో పాటు క్లీన్ సెటిల్మెంట్, వివాదాలను తగ్గించేందుకు దోహదపడనుంది.

డీఏపీ ధర పెరగకుండా చర్యలు

పంటల బీమా పథకాల పొడిగింపునకు నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం మరో భారీ ప్రయోజనాన్ని రైతులకు అందించనుంది. డీఏపీపై ఇప్పటి దాకా సబ్సిడీని అందించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. గత పది రోజులుగా ఈ సబ్సిడీని అందించే అవకాశం లేదని, క్వింటం సబ్సిడీపై మరో రూ.200 పెంచేందుకు కంపెనీలు నిర్ణయం తీసుకోనున్నాయని వార్తలు వస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అయితే వారి ఆందోళనలకు చెక్ పెడుతూ సబ్సిడీని కొనసాగించేందుకు కేంద్ర క్యాబినెట్ వన్‌టైమ్ స్పెషల్ ప్యాకేజీని పొడిగించాలని నిర్ణయం తీసుకుంది. డీఏపీ మెట్రిక్ టన్నుకు స్పెషల్ ప్యాకేజీ కింద రూ.3,500 రాయితీని ఇవ్వాలని, దీనిని జనవరి 1వ తేదీ నుంచి అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. యూరియాతో పాటు రైతులకు అవసరమైన డీఏపీని తక్కువ ధరలో అందుబాటులో ఉంచేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయంపై రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల 50 కేజీల డీఏపీ బస్తా రూ.1350కే రైతులకు అందనుంది. ఈ డీఏపీ ప్యాకేజీకి కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.3,850 కోట్లు కేటాయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

రైతులకు ఎంతో మేలు



కేంద్ర ప్రభుత్వం రైతులు ఎంతో మేలు జరిగే నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు డీఏపీ బస్తా ధర కేంద్రం ఇచ్చే సబ్సిడీతో కలుపుకుని ప్రస్తుతం రూ.1,350 అమలులో ఉంది. ఈ ధరను పెరగకుండా ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీని కొనసాగించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకోవడం రైతులకు ఎంతో మేలు జరిగింది. పంటల బీమా పథకాల కొనసాగింపు కోసం ఎ నిధులు విడుదల చేయడం శుభపరిణామం.

- వరలక్ష్మి, జేడీ

పెరిగిన పత్తి ధర

క్వింటా రూ.7,405

ఆదోని అగ్రికల్చర్, జనవరి (ఆంధ్రజ్యోతి) 3: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కొత్త ఏడాది పత్తి ధరలు పుంజుకున్నాయి. శుక్రవారం పత్తి ధర క్వింటా గరిష్ఠగా రూ.7,405 పలికింది. గత వారంతో పోల్చితే క్వింటానికి పత్తి ధర రూ.350పైగా ధర పెరిగింది. ధరలు మళ్లీ స్వల్పంగా పుంజుకోవడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దూది ధరలు పత్తి గింజల ధరలు పెరగడం వల్ల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. 3,846 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4,300, గరిష్ఠ ధర రూ.7,405, మధ్యధర రూ.7,169 పలికింది.

ప్యాపిలి టూ ఇరాన్, ఇరాక్

- ఏటా వేల టన్నుల అరటి విదేశాలకు
- ఆక్కడ డిమాండ్‌తో ధరలు ఆశాజనకం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

ప్యాపిలి అరటికి ఇరాన్, ఇరాక్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి అరటి పండ్లను తినడానికి ఆ దేశస్తులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఏటా ప్యాపిలి నుంచి ఇరాన్, ఇరాక్ దేశాలకు వేల టన్నుల అరటి ఎగుమతి అవుతోంది. విదేశాల్లో డిమాండ్ ఉండటంతో ఇక్కడి అరటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

ప్యాపిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మండలంలోని నల్లమేకలపల్లి, హుసేనాపురం, పీఆర్‌పల్లి, పెద్దపా య, వీకేపురం, బోయవాండ్లపల్లి, గుడిపాడు, రాచవాండ్లపల్లి తదితర గ్రామాల రైతులు అధికంగా అరటిని సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.లక్ష నుంచి లక్షన్నర పెట్టుబడి పెట్టి పంటను సాగు చేస్తున్నారు. 15ఏళ్ల క్రితం ఏదో కొంత మంది రైతులు అరటిని సాగు చేసేవారు. అయితే మండలంలోని భూములు అరటికి అనుకూలంగా ఉండటం, ప్రభుత్వం రాయితీలు కల్పించడంతో ప్రస్తుతం వేలాది ఎకరాల్లో రైతులు పంటను సాగు చేస్తున్నారు.





కెమికల్‌తో అరటి కాయలను శుభ్రపరుస్తున్న దృశ్యం

జీ9 రకం అరటికి మంచి డిమాండ్

జీ9 రకం అరటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ రకం అరటి మంచి పోషకాలతోపాటు రుచికరంగా ఉంటాయి. మిగితా రకం అరటితో పోల్చుకుంటే జీ9 ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. దీనివల్ల విదేశాల్లో వ్యాపారులు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఫ్రూట్ కేర్ యాక్టివిటీతో కాయలకు నాణ్యత

ఫ్రూట్ కేర్ యాక్టివిటీతో నాణ్యతగా అరటి దిగుబడులు వస్తాయి. కాయల సైజు బాగా ఉంటాయి. ఈ పద్ధతిని పలు విదేశాల్లో రైతులు పాటిస్తున్నారు. అదే తరహాలో రాష్ట్రంలో కూడ ఫ్రూట్ కేర్ యాక్టివిటి పద్ధతిని అవలంబిస్తున్నామని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. దీని ద్వారా అరటి గెలలకు కవరు ఏర్పాటు చేసి, కాయలు నాణ్యతగా రావడానికి ఇంజక్షన్ ద్వారా మందుల వేస్తారు.

తోటల నుంచి కోసిన అరటి గెలలు





ప్యాపిలి మండలంలో పండిన జీ9 రకం అరటి



అరటిని విదేశాలకు తరలించేందుకు వ్యాపారులు ఏర్పాటు చేసిన బాక్సులు

2500 ఎకరాల్లో అరటి సాగు

మండలంలో 2500 ఎకరాల్లో జీ9 రకం అరటిని రైతులు సాగు చేస్తున్నారు. ప్యాపిలి మండలంలోని నల్లమేకలపల్లి, చంద్రపల్లి, మెట్టుపల్లి, పీఆర్‌పల్లి, గుడిపాడు, బోయవాండ్లపల్లి, వీకేపురం తదితర గ్రామాల్లో ఈ రకం అరటికి అనుకూలమైన భూములు ఉన్నాయి. ఈ రకం అరటికి ప్యాపిలి మండలంలో తప్ప జిల్లాలో ఎక్కడ అనుకూలమైన సారవంతమైన భూములు లేవని అధికారులు చెబుతున్నారు. అందువల్ల ఇక్కడి రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

ఐదేళ్లుగా విదేశాలకు ఎగుమతులు

ప్యాపిలి మండలం నుంచి ఐదేళ్లుగా అరటి కాయలు ఇరాన్, ఇరాక్ దేశాలకు ఏటా దాదాపు 10వేల టన్నుల అరటిని ఎగుమతి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడ అరటి తోటలు కొన్న వ్యాపారులు రైలు వ్యాగిన్‌ల ద్వారా ముంబాయి, నాగపూర్ పట్టణాలకు తరలించి అక్కడ నుంచి విదేశాలకు విమానాల ద్వారా ఎగుమతి చేస్తున్నారు.

టన్ను అరటి ధర రూ.60 వేలు

ఇరాన్, ఇరాక్ దేశాల్లో ప్యాపిలి అరటి టన్ను ధర రూ.60 వేలు పైనే పలుకుతున్నట్లు తెలుస్తోంది. దీంతో విదేశాలకు ఎగుమతి చేసే మహారాష్ట్ర కంపెనీలు ఇక్కడికి వచ్చి అరటిని కొంటున్నాయి. టన్ను రూ.25 వేలు నుంచి రూ.30 వేలు వరకు కొంటున్నారు.

పండ్ల తోటలకు రూ.1.21 కోట్లు విడుదల

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పండ్ల తోటల అబివృద్ధికి ప్రభుత్వం రూ.1.21 కోట్ల నిధులను విడుదల చేసిందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు తెలిపారు. పండ్ల తోటల విస్తరణకు రూ.35.95 లక్షలు, హైబ్రిడ్ కూరగాయల సాగుకు రూ.21.16 లక్షలు, పూలతోటల సాగుకు రూ.8.27 లక్షలు, రెండో సంవత్సరం యాజమాన్యం పనులకు రూ.3.61 లక్షలు, మూడో సంవత్సరం యజమాన్యం పనులకు రూ.5.83 లక్షలు మంజూరయ్యాయి. అదేవిధంగా మామిడి పాత తోటల పునరుద్ధరణకు రూ.11.87 లక్షలు, రక్షిత సాగు కోసం రూ.5.56 లక్షలు, కోత అనంతరం నిల్వ చేసేందుకు ప్యాక్ హౌస్‌ల నిర్మాణానికి రూ.5.70 లక్షలు, యాంత్రీకరణకు రూ.23.16 లక్షలు, తేనెటీగల పెంపకానికి రూ.56వేలు విడుదలయ్యాయి.జ నేషనల్ మిషన్ (నూనె గింజలసాగు) అభివృద్ధి కింద ఆయిల్ ఫాం తోటల పెంపకానికి రూ.25.96 లక్షలు, మొదటి సంవత్సరం నిర్వహణకు రూ.3.87 లక్షలు, జాతీయ వెదురు మిషన్‌లో మొక్కల ఖర్చుకు రూ.2.08 లక్షలు మంజూరయ్యాయి.

ఐసీయంఆర్‌కు ఐదు ప్రాజెక్టులు



అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు హస్పిటల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని భారతీయ వైద్య పరిశోధన సంస్థ (ఐసీఎంఆర్) దేశ వ్యాప్తంగా వైద్య విద్యార్థుల పరిశోధన ప్రతిపాదనలో కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన ఫార్మాకాలజీ నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. దేశంలోని మెడికల్ కాలేజీ నుంచి సేకరించిన ప్రతిపాదన స్వీకరణలో ఫార్మాకాలజీ విభాగానికి చెందిన విద్యార్థుల పరిశోధనలకు ఐసీఎంఆర్ అనుమతి లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం కర్నూలు మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి. చిట్టినరసమ్మ వైద్య విద్యార్థులను, ఫార్మాకాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజేష్‌ను అభినందించారు. వైద్యవిభాగంలో పరిశోధన నిమితం ఐసీఎంఆర్ ప్రతిష్టాత్మకంగా వీటిని ఎంపిక చేస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఫార్మాకాలజీ హెచ్‌ఓడీ రాజేష్ మాట్లాడుతూ తమ విభాగానికి చెందిన వైద్య విద్యార్థుల ఐదు పరిశోధన ప్రాజెక్టులకు ఐసీఎంఆర్ నుంచి అనుమతి లభించడం సంతోషంగా ఉందన్నారు. పరిశోధనకు ఎంపికైన వైద్య విద్యార్థులు సాహితి, సుమేధ, శివసోకిత్, మహ్మద్, అఖిల్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.

మహిళా అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు

148 మంది ఎంపిక



ఫిజకల్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ జి. బిందుమాధవ్, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణీ

కర్నూలు క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం నాల్గవ రోజు కొనసాగాయి. స్థానిక ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలను ఎస్పీ జి. బిందుమాధవ్ పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 739 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 301 మంది బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టుల్లో 1600 మీటర్ల పరుగు పరీక్షలో 198 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 50 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 146 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ (ఫైనల్) పరీక్షకు నాల్గవ రోజు 148 మంది మహిళా అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాటకరంగానికి ఆదరణ

- నాటక, సాహితీ సభలకు నిలయం టీజీవీ కళాక్షేత్రం
- నాటకరంగానికి సుబ్బరాయశర్మ సేవలు ప్రశంసనీయం
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- ముగిసిన రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు



డాక్టర్ జి.రవికృష్ణను సత్కరిస్తున్న టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి, సుబ్బరాయశర్మ, పత్తి ఓబులయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో నాటక రంగానికి, కళలకు ఆదరణ ఎప్పటికీ ఇలాగే కొనసాగుతుందని రాజ్యసభ మాజీ సభ్యుడు, మాజీ మంత్రి టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు. మూడు రోజులుగా నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగిన రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు శుక్రవారం ముగిశాయి. నాటకోత్సవాల ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ నగరంలోని టీజీవీ కళాక్షేత్రం కళా ప్రదర్శనలకు, సాహిత్య సభలకు నిలయంగా తీర్చిదిద్దామని తెలిపారు. కళలకు, కళాకారులకు తమ ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. నాటకం, టీవీ, సినిమా రంగాలకు దాదాపుగా 50 ఏళ్ల సేవలు అందించిన సుబ్బరాయశర్మ కృషి ప్రశంసనీయమని అన్నారు. చిత్ర నిర్మాత బీవీ రెడ్డి మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం, హైదరాబాదు మహతి క్రియేషన్స్ సంయుక్తంగా మూడు రోజుల నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం హర్షదాయకమని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ ప్రతిభను ఈ నాటకోత్సవాల్లో చాటి చెప్పారని వారిని అభినందించారు. కళారంగం బతికి ఉన్నప్పుడే మన సంస్కృతి జీవిస్తుందని అన్నారు. జిల్లా ఏఎస్పీ హుస్సేన్ పీరా మాట్లాడుతూ సాంఘిక నాటకాలు మన జీవితానికి అద్దం వంటివని, సమస్యలను ప్రేక్షకుల ముందుకు తీసుకువెళ్లడానికి నాటకం ఒక మంచి సాధనంగా నిలుస్తోందని అన్నారు. సినీ, టీవీ నటుడు సుబ్బరాయశర్మ మాట్లాడుతూ కర్నూలులో నాటకరంగానికి మంచి ఆదరణ ఉందన్నారు. తనకు కర్నూలుతో ఉన్న అను బంధంతో ఈ ఏడాది ఇక్కడ నాటకోత్సవాలు ఏర్పాటు చేశామన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ చాలాకాలం తర్వాత ఏర్పాటు చేసిన ఈ నాటకోత్సవాలు ప్రేక్షకులకు ఆనందాన్ని పంచాయని చెప్పారు.



'ఉక్కు సంకెళ్లు' నాటికలోని ఒక దృశ్యం

కళాకారులకు నగదు ప్రోత్సాహం

నంద్యాలలోని కళారాధన సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గుర్రాల రవికృష్ణను అతిథులు, సుబ్బరాయశర్మతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.రవికృష్ణ మాట్లాడుతూ వైద్య రంగంతోపాటూ కళారంగాన్ని సమస్థాయిలో ముందుకు తీసుకువెళ తున్నామని అన్నారు. కళారాధన సంస్థ ద్వారా నంద్యాలలో సాంఘిక నాటకాలకు జీవం పోస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం లో సుబ్బరాయశర్మ జన్మదినం సందర్భం గా ఆయన కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే జిల్లాకు చెందిన కళాకారులు సరస్వతమ్మ, సర్వోత్తమ రెడ్డిలకు మహతి క్రియేషన్స్ తరపున రూ.5వేలు చొప్పున ఇరువురికి నగదును సుబ్బరాయశర్మ అందజేశారు. ఇటీవల అనారోగ్యానికి గురైన నంది అవార్డు గ్రహీత శామ్యూల్‌కు వైద్య సహాయం నిమిత్తం కళాక్షేత్రం తరపున పత్తి ఓబులయ్య రూ.30 వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. మున్ముందుకూడా వైద్య సహాయం అవసరం ఉంటే తగిన సహాయ సహకారాలు కళాక్షేత్రం తరపున అందిస్తామని చెప్పారు. మహతి క్రియేషన్స్ ప్రతి నిధి పోత రాజు జ్యోతి ప్రజ్వ లన చేసి ప్రారం భించిన ఈ కార్యక్రమంలో చివరగా సుబ్బ రాయశర్మ దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఉక్కు సంకెళ్లు' నాటిక ప్రేక్షకులను అలరింపజేసింది.

నేడు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ శనివారం నందికొట్కూరు రోడ్డులోని వెంకాయపల్లె దగ్గర ఉన్న రవీంద్ర గ్లోబల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ శుక్రవారం తెలిపారు. పాఠశాల, మండల స్థాయి పోటీల్లో ఎంపికైన ప్రాజెక్టులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్నాయని అన్నారు. భౌతిక, రసాయనశాస్త్రాలు, గణితం, ఎర్త్ సైన్స్, పర్యావరణం, ఇంజనీరింగ్, బయో సైన్స్, బయో కెమిస్ట్రీ కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించిన ఉప అంశాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన నమూనాలో 26 వ్యక్తిగత ప్రాజెక్టులు, 26 గ్రూప్, టీచర్ల వారీగా ప్రాజెక్టులు ఉంటాయని అన్నారు. శాస్త్రీయ దృక్పథం, సామాజిక ప్రయోజనకారిగా ఉన్న ప్రాజెక్టులను మాత్రమే ప్రదర్శించాలన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, పాఠశాలల నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుతో సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో పాల్గొనాలని సూచించారు. జిల్లా స్థాయిలో పాల్గొన్న ప్రాజెక్టుల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి విజయవాడలో రెండో శనివారంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని డీఈవో తెలిపారు. జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను పూర్తయినట్లు జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ తెలిపారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ ఉదయం 8 గంటలకే చేరుకోవాలని ఆమె తెలిపారు.

3 న్యూసిటీ-01 మాట్లాడుతున్న ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి

సంక్రాంతికి నూతన రహదారులు

పీఆర్ ఎస్ఈ వి. రామచంద్రారెడ్డి



కర్నూలు, న్యూసిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీరాజ్ ఎస్ఈ వి. రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జాతీయ రహదారులు, జిల్లా ప్రధాన రహదారులకు ఇతోధికంగా నిధులు విడుదల చేస్తూనే, గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గ రోడ్లకు కూడా నిధులు మంజూరు చేసిందన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 84 కిలోమీటర్ల మేర రూ.68 కోట్లతో 828 సీసీ రోడ్లు, 2 బీటీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. 830 పనులకు గాను ఇప్పటి వరకు జిల్లాలో 715 పనులు పూర్తి అయ్యాయన్నారు. మిగిలినవి ప్రొగ్రెస్‌లో ఉన్నాయన్నారు. వాటిని సంక్రాంతికి పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఎస్ఈ తెలిపారు.

ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచాలి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త రీచ్‌లను ఎప్పటికప్పుడు గుర్తించి ఇసుకను ప్రజలకు అందుబాటులోకి ఉండేలా చర్యలు తీసుకోవాలని గనుల శాఖ ప్రిన్సిపాల్ ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఇసుక సరఫరా అంశంపై గనుల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక నిల్వలు పెంచేందుకు కొత్త ఇసుక రీచ్‌లను ఎప్పటికప్పుడు గుర్తించి ఇసుకను ప్రజలకు అందుబాటులోకి ఉంచాలన్నారు. వాటికి అవసరమైన పర్యావరణ అనుమతులు త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పాల్గొన్నారు.

సూర్యాస్తమయ సౌందర్యం..!



కందనవోలు నగర శివారున.. ఆకాశ వీధిలో సూర్యాస్తమయ శోభ అబ్బురపరిచింది. ఆకాశాన ఎర్రటి తివాచి పరిచినట్లు అస్తమిస్తున్న సూర్యుడు చూడముచ్చటగా కనిపించాడు. ఆ అందమైన సూర్యుడి అందాలను అంజనీపుత్రుడు ఆస్వాదిస్తున్నట్లు ఉన్న ఈ చిత్రం చూపరులను కట్టిపడేసింది. రోజంతా పసుపు బంగారు కాంతితో ప్రకాశించిన సూర్యుడు... సాయంత్రం మాత్రం ఇలా ఎరుపు రంగులో కనిపించాడు. ఆ సమయంలో ఆకాశం సైతం అనేక రంగుల్లో కనిపించింది. ఎరుపు, నారింజ, నీలం, పసుపు, ఊదా రంగులు ఆకాశం అంతటా వ్యాపించాయి. జగన్నాథగట్టుపై వినువీధిలో ఆవిష్కృతమైన ఈ సుందర దృశ్యాన్ని శుక్రవారం సాయంత్రం ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది.

ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు (ఆంధ్రజ్యోతి).

పట్టు చీరల కోసం వెళ్లి పరలోకానికి...

'అనంత'లో రోడ్డు ప్రమాదం...

తుగ్గలి మండలానికి చెందిన దంపతుల దుర్మరణం


రాజశేఖర్‌చౌదరి, సుమలత (ఫైల్‌)

పెద్దవడుగూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మరో నెల రోజుల్లో జరిగే గ్రామ జాతర కోసం పట్టు చీరలు కొనేందుకు వెళ్లి తిరిగి వస్తున్న వారికి అదే చివరి ప్రయాణమైంది. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలో కిష్టిపాడు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజశేఖర్‌చౌదరి (28), సుమలత (25) దంపతులు మృతిచెందారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టింది. 67వ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెన్నంపల్లికి చెందిన రాజశేఖర్‌ చౌదరి, సుమలత దంపతులు పట్టు చీరల కోసం యాడికి మండల కేంద్రానికి ద్విచక్ర వాహనంలో వచ్చారు. తమ గ్రామంలో ఫిబ్రవరిలో ఊరి జాతర ఉండటంతో పట్టు చీరలు కొనుగోలు చేశారు. స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా గుత్తి వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరూ ఎగిరి రోడ్డు పక్కనపడ్డారు. తీవ్ర గాయాలతో అక్కడి కక్కడే మృతిచెందారు. బొలెరో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకు వెళ్లింది. యాడికి పట్టణానికి చెందిన డ్రైవర్‌ సాయి మద్యం మత్తులో వాహనాన్ని నడిపినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో సాయి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని పెద్దవడుగూరు ఎస్‌ఐ ఆంజనేయులు సందర్శించారు. మృతదేహాలను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజశేఖర్‌ చౌదరి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతిచెందిన దంపతులకు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కంది మిషన్‌లోపడి మహిళ మృతి

తుగ్గలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కంది పంటను నూర్పిడి మిషన్‌లో వేస్తుండగా.. ప్రమాదవశాత్తు అనంతమ్మ (45) అనే మహిళ తల మిషన్‌లో పడి మృతి చెందింది. శుక్రవారం మండలంలోని రామలింగాయపల్లెలో మాధవయ్య, హనుమంతమ్మ దంపతులు కౌలు పొలంలో వేసిన కంది పంటను మిషన్‌లో వేస్తుండగా.. అనంతమ్మ చీర మిషన్‌లో పడి లాగేసుకుంటుండగా.. ఆమె తల లోపలికి వెళ్లి గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. జొన్నగిరి పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, ఎస్టీ సెల్‌ ఉపాధ్యక్షుడు వెంకటపతి, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేశ్వర్లు, సీపీఐ నబీ రసూల్‌ సంఘటనా స్థలానికి చేరుకుని అనంతమ్మ భౌతిక కాయానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

నీటి వనరుల ఆక్రమణలను తొలగించాలి

కర్నూలు కలెక్టరేట్‌, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి వనరుల ఆక్రమణలను తొలగించే చర్యలు చేపట్టాలని జాయింట్‌ కలెక్టర్‌ డా.బి. నవ్య నీటి వనరులు, చెరువులు భూముల జిల్లా స్థాయి పరిరక్షణ కమిటీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌ హాల్లో నీటి వనరులు, చెరువుల భూముల జిల్లా స్థాయి పరిరక్షణ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్‌ కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులు, వాటి సమీపంలో ఎలాంటి ఆక్రమణలు ఉన్నా, వాటిపై సర్వే చేసి పూర్తి వివరాలను ఆదివారంలోపు సమర్పించాలని కమిటీని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలు తాత్కాలికంగా నిర్మించారా? లేక పర్మినెంట్‌గా ఉండేలా నిర్మించారా..? అన్న విషయాలను సేకరించాలన్నారు. రెవెన్యూ వారు, ఇరిగేషన్‌ డిపార్టుమెంట్‌, సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సి. వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్‌ కుమార్‌, డీపీవో భాస్కర్‌, మున్సిపల్‌ కమిషనర్‌ రవీంద్రబాబు తదితరులుపాల్గొన్నారు.

మాట తప్పిన చంద్రబాబు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు చేసిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పాడని, ఇందులో ఆయనకు బ్రాండ్‌ ఇమేజ్‌ ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డిఅన్నారు. శుక్రవారం ఎస్వీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి మండలి సమావేశంలో ప్రజలు ఆశించిన అమ్మఒడి పథకాన్ని వచ్చే సంవత్సరం నుంచి అమలు చేస్తానని ప్రకటించడంతో తల్లిదండ్రులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, గ్రంథాలయ మాజీ చైర్మన్‌ సుభాష్‌ చంద్రబోసు, కార్పొరేటర్లు క్రిష్ణకాంత్‌రెడ్డి, షాషావలి, రాజేశ్వరరెడ్డి, నాయకులు షరీఫ్‌, మల్లి పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి నందివర్గం విద్యార్థి మృతి


సాయిసంతోష్‌ (ఫైల్‌)

బనగానపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్రాసులో బీటెక్‌ మొదటి సంవత్సరం చదువుతున్న నందివర్గం గ్రామానికి చెందిన సాయిసంతోష్‌రెడ్డి (18) సముద్రంలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. ఈ ఘటన మద్రాసు మెరీనా బీచ్‌లో చోటు చేసుకుంది. పాణ్యం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన వెంగళరెడ్డి కుటుంబం నందివర్గంలో స్థిరపడింది. ఆయన రెండవ కుమారుడు సంతోష్‌రెడ్డి మద్రాస్‌లోని సవితా యూనివర్సిటీలో బీటెక్‌ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తన తోటి స్నేహితులతో కలసి ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆమె ప్రత్యేక చొరవ తీసుకొని సంతోష్‌రెడ్డి మృతదేహాన్ని వెలికి తీయాలని తమిళనాడు సీఎం స్టాలిన్‌కు లేఖ రాయగా తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని సంతోష్‌రెడ్డి మృతదేహాన్ని శుక్రవారం వెలికి తీశారు. ఎన్నో ఆశలతో మద్రాసుకు చదువు కోసం పంపిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయారు. కుటుంబసభ్యులు మృతదేహాన్ని తీసుకోవడాని మద్రాసు వెళ్లారు. కాగా వెంగళరెడ్డికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు నందివర్గంలో వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు.

సంచార వాహనాల్లో కూరగాయల విక్రయం

● జాయింట్‌ కలెక్టర్‌ బి.నవ్య

కర్నూలు అగ్రికల్చర్‌, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలను అదుపులో ఉంచడంతో పాటు ప్రజల ఇళ్ల వద్దకే నాణ్యమైన కూరగాయలను చేర్చి విక్రయించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని జాయింట్‌ కలెక్టర్‌ డా.బి. నవ్య కోరారు. శుక్రవారం కర్నూలు నగరంలోని సీ. క్యాంపు రైతుబజారులో కూరగాయల సంచార వాహనాన్ని జాయింట్‌ కలెక్టర్‌ జెండా ఊపి ప్రారంభించారు. జాయింట్‌ కలెక్టర్‌ డా.బి. నవ్య మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలను అందించేందుకు సంచార కూరగాయల వాహనాలను ఏర్పాటు చేశామని అన్నారు.

చిన్నవంగలి పాల డెయిరీ ఎన్నికల్లో ఉద్రిక్తత

● టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ
● బైఠాయించిన టీడీపీ నాయకులు
వాయిదాపడ్డ ఎన్నికలు ● గ్రామంలో పోలీసు పికెటింగ్‌


చిన్నవంగలి పాల కేంద్రం వద్ద బైఠాయించిన టీడీపీ నాయకులు

చాగలమర్రి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో శుక్రవారం జరిగిన పాల డెయిరీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఉద్రిక్తంగా మారింది. రెండు డైరెక్టర్‌ పదవులకు నంద్యాల ఎన్నికల అధికారులు రామకృష్ణారెడ్డి, నాగిరెడ్డి, పద్మయ్య అభ్యర్థుల నామినేషన్‌లు స్వీకరించేందుకు ఏర్పాటు చేశారు. ఆళ్లగడ్డ రూరల్‌ సీఐ కంబగిరి రాముడు, కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్‌ ఆధ్వర్యంలో పాల డెయిరీ వద్ద స్పెషల్‌ పార్టీలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుగా టీడీపీ వర్గానికి సంబంధించిన ఇద్దరు నామినేషన్లు వేశారు. అనంతరం వైసీపీ వర్గానికి చెందిన వారు నామినేషన్లు వేసేందుకు పాల డెయిరీ వద్దకు వచ్చారు. వారితో నామినేషన్‌ వేయించేందుకు పోలీసు అధికారులు సహకరించి వారిని కేంద్రం లోపలికి పంపించి గేట్లు వేశారు. టీడీపీ నాయకులను కేంద్రం వద్దకు రానివ్వకుండా పోలీసు అధికారులు అడ్డుకున్నారు. దీంతో కేంద్రం వద్ద పోలీసు అధికారులకు, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం నెలకొంది. పోలీసు అధికారులు ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. టీడీపీ మండల కన్వీనర్‌, న్యాయవాది నరసింహారెడ్డి కేంద్రం వద్దకు చేరుకొని పోలీసులతో మాట్లాడుతుండగా టీడీపీ నాయకులను, మండల కన్వీనర్‌ను పోలీసులు బయటకు లాగారు. ఈ ఘటనలో మండల కన్వీనర్‌ నరసింహారెడ్డి, టీడీపీ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి వేసుకున్న దుస్తులు చినిగి పోయాయి. దీంతో వారు అర్ధనగ్నంగా కేంద్రం వద్ద బైఠాయించి పోలీసుల తీరుకు నిరసన ప్రకటించారు. సీఐలు, ఎస్‌ఐ హరిప్రసాద్‌ కలుగజేసుకొని శాంతిభద్రతలకు భంగం కలిగించరాదని, అక్కడి నుంచి నుంచి వెళ్లిపోవాలంటూ చెప్పడంతో అక్కడి నుంచి టీడీపీ వర్గీయులు వెనుతిరిగి వెళ్లారు. ఎస్పీ ఆదేశాల మేరకు నంద్యాల సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ హరిప్రసాద్‌, స్పెషల్‌ పార్టీ పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తుగా పోలీసు పికెటింగ్‌ ఏర్పాటు చేశారు.

● వాయిదా పడ్డ పాల డెయిరీ ఎన్నికలు

చిన్నవంగలి పాల డెయిరీ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ నెలకొనడంతో శాంతి భద్రతల దృష్ట్యా పోలీసు అధికారుల ఆదేశాలతో ఎన్నికలు వాయిదా వేశామని ఎన్నికల అధికారి రామకృష్ణారెడ్డి, నాగిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలు వాయిదాపడ్డాయని పాల డెయిరీ కేంద్రం గోడకు పేపర్‌ అతికించారు. తిరిగి ఎన్నికల తేదీ ప్రకటిస్తామని అందులో పేర్కొన్నారు.

వైసీపీలో విభేదాలు

● శిలాఫలకంలో పేరు లేదని పగులకొట్టే యత్నం


శిలాఫలకంలో పేరు లేదంటున్న ఉప సర్పంచ్‌ ప్రమీలమ్మ దంపతులు

మద్దికెర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్దికెర వైసీపీలో విభేదాలు నెలకొన్నాయి. శిలాఫలకంలో సర్పంచ్‌ పేరు లేకపోవడంతో ఈ విభేదాలు బట్టబయలయ్యాయి. మద్దికెర మెయిన్‌ బజారులో రూ.22 లక్షలతో నాబార్డు, పంచాయతీ నిధులతో కలిపి నాబార్డు కూరగాయల మార్కెట్‌ ప్రారంభ శిలాఫలకం వేయించారు. అయితే అందులో ఉప సర్పంచ్‌ ప్రమీలమ్మ పేరు లేకపోవడంతో ఆమె భర్త రామాంజులు, అనుచరులు ఆ శిలాఫలకాన్ని పగులకొట్టేందుకు యత్నించారు. వ్యాపారుల సౌకర్యార్థం కూరగాయల మార్కెట్‌ నిర్మాణ పనులను 2వ తేదీన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేయించిన శిలాఫలకంలో జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, కాంట్రాక్టర్ల పేర్లన్నీ ఉన్నాయి. గ్రామ ఉప సర్పంచ్‌ ప్రమీలమ్మ పేరు మాత్రం వేయించలేదు. దీంతో ఆగ్రహించిన భర్త రామాంజులు శిలాఫలకాన్ని రాళ్లతో పగులగొట్టగా నెర్రెలిచ్చింది. ఒకే పార్టీలో ఉంటూ అందరి పేర్లు వేసి కావాలనే తమ పేరు రాయలేదంటూ ఆయన ఆరోపిస్తున్నా డు. శుక్రవారం ఉదయం పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌తో వాగ్వాదానికి దిగాడు. గ్రామంలో ముగ్గురు ఎంపీటీసీల పేర్లు వేసినప్పుడు, తమ పేర్లు ఎందుకు వేయలేదని నిలదీశాడు.

పెట్రోల్‌ బంకులో ఘరానా మోసం

● అనుమానం వచ్చి కొలిచిన ద్విచక్ర వాహనదారుడు
● తప్పైందని అంగీకరించిన నిర్వాహకులు


పెట్రోల్‌ను కొలుస్తున్న ద్విచక్ర వాహనదారుడు

ఆదోని రూరల్‌, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పెట్రోలు బంకు నిర్వాహకుల ఘరానామోసం బట్ట బయలైంది. ఆస్పరి బైపాస్‌లో ఉన్న ఓ పెట్రోల్‌ బంకుకు మండలం గణేకల్లు గ్రామానికి చెందిన గౌండా పాండురంగ శుక్రవారం కె.ఏ 01ఈటి 3288 ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. బెంగుళూరుకు వెళుతూ మార్గమధ్యంలో ఆదోని ఆస్పరి బైపాస్‌లో ఉన్న లక్ష్మీ చెన్నకేశవ హెచ్‌పి పెట్రోల్‌ బంకుకు వెళ్లాడు. రూ.1210/-లు పెట్రోలు వేయించుకున్నా ట్యాంకు నిండకపోవడంతో అనుమానం వచ్చి బండి ట్యాంకులో పోసిన పెట్రోల్‌ను చెక్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. దీంతో నిర్వాహకులు బండిలో ఉన్న పెట్రోలును కొలిచారు. దాదాపు 12లీటర్లు ఉండాల్సిన చోట 8లీటర్లే తేలింది. దీంతో ద్విచక్ర వాహన దారుడు పెట్రోల్‌ బంకు నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగాడు. దీంతో పెట్రోలు బంకు సిబ్బంది తప్పైందని అంగీకరించారు. డబ్బులు ఇస్తామని, ఇంకోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని చెప్పి నగదు వాపసు ఇచ్చాను.













సీఎం చంద్రబాబును కలిసిన తిక్కారెడ్డి



సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నాయకులు

కర్నూలు అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్ సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం అమరావతిలో చంద్రబాబును కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పత్తికొండ నియోజకవర్గం హోసూరు నుంచి పెద్దహుల్తి సమీపంలో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు నిర్మాణానికి కెబినెట్‌లో అనుమతి తెలపడంపై ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం, పార్టీ సంస్థాగత అంశాలపై చర్చించారు.

'సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి'

గూడూరు జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు జె.సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కె నాగలాపురం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదుపై ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదుకు ప్రజలు, కార్యకర్తల నుంచి స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కోడుమూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి- కొత్తూరు గ్రామాల మధ్య గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి రామగోవిందు, ఆయన భార్య వర లక్ష్మీ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొన్న కోడుమూరు, పత్తి కొండ ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబులు శుక్రవారం కోడుమూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొన్నారు. ఆసుపత్రిలోని ఉన్న మృతదేహాలకు పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. అనం తరం మృతుడి కుమారుడు, కూతూరులను వారు పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేఈ మల్లికార్జునగౌడ్, బడెసాగౌడ్, రాముడు, నారాయణ, రవీంద్రగౌడ్, అయ్యప్ప పాల్గొన్నారు.

క్రీడా కోటాను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడాకారులు ప్రభుత్వం అందిస్తున్న క్రీడా కోటాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు కోరారు. శుక్రవారం డీఎస్ఏ స్టేడియంలో హాకీ అసోసియేషన్ నిర్వహించిన సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీల్లో ఆయన పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు డి.ప్రవీణ్, అరుణ్, రవికుమార్, మనోహర్, సీనియర్ క్రీడాకారులు ప్రతాప్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండాపురాన్ని సందర్శించిన డీఎల్‌పీవో

సి.బెళగల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం గ్రామ పంచాయతీని కర్నూలు డీఎల్‌పీవో లక్ష్మీదేవి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండాపురం, మజరా గ్రామమైన పల్దొడ్డిలో వీధి దీపాలు, తాగునీరు, మురుగు కాలువలను శుభ్రం చేయాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి, సర్పంచుకు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తమకు ఫిర్యాదు చేశారన్నారు. శుక్రవారం కర్నూలు డీఎల్‌పీవో లక్ష్మీదేవి కొండాపురంలో పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట ఈవోఆర్డీ ఈశ్వర స్వామి, సర్పంచ్ రత్నమ్మ ఉన్నారు.

'ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలి'

కర్నూలు కలెక్టరేట్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంజి డిమాండ్ చేశారు. శుక్రవారం బీవీఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ కోసం కమిషన్ను ఏర్పాటు చేసి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ఎర్ర శంకర్, ఈశ్వర య్య, పూల శంకరయ్య, చరణ్ నాయుడు, దేవేంద్ర నాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీలు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంఈవో ఓంకార్ యాదవ్

ఓర్వకల్లు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి యజమాన్య కమిటీలు సహకరించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఓర్వకల్లులోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో పాఠశాలల యజమాన్య కమిటీ చైర్మన్లకు, ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలల యజమాన్య కమి టీ సమావేశాల నిర్వహణ, విధి విధానాలు, కమిటీల ఏర్పాటు, బాలల హక్కుల పరిరక్షణపై ఎంఈవో అవగాహన కల్పించారు. ఈశిక్షణకు రిసోర్స్‌పర్సన్లుగా పోలూ నాయక్, శేఖర్ నాయక్, శంకర్‌లు వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

కర్నూలు కల్చరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని భారత్ పెట్రోలియం లిమిటెడ్ సంస్థ టెర్రిటరీ మేనేజర్ తుషార్ జగతాప్ అన్నారు. శుక్రవారం నగర శివారు గుత్తిరోడ్డులోని ఎల్‌పీజీ రీజనల్ గ్యాస్ ఫిల్లింగ్ ప్లాంట్ సమావేశ మందిరంలో ఎల్‌పీజీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ సిబ్బందితో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎల్‌పీజీ గ్యాస్ ఫిల్లింగ్ రీజనల్ కార్యాలయం, బాలసాయి కంటి ఆసు పత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో జరిగిన ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ కేజీ గోవిందరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా అడిషనల్ క్యాబినేట్ మాజీ సెక్రటరీ డాక్టర్ రాయ పాటి శ్రీనివాస్, డాక్టర్ జయప్రకాశ్, ఎల్‌పీజీ సేల్స్ ఆఫీసర్ బి. సురేష్ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు అస్వస్థత

సి.బెళగల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ రామయ్య సాయంత్రం విధుల్లో ఉండగా ఉన్నట్లుండి మాట్లాడలేకపోయాడు. పక్కనే ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు లేకపోవడంతో పోలీసులు దారిన పోతున్న మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ కారును నిలబెట్టి విషయం చెప్పారు. ఆయన కారు ఇవ్వడంతో హెడ్‌కానిస్టేబుల్‌ను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.శారద అధ్యక్షతన చేపట్టిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సావిత్రీబాయి పూలే, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండలస్థాయి అధికారులు మూడు నెలల్లో సాధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండలంలో రూ.1.06 కోట్లతో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు తదితర అభివృద్ధి పనులు చేశామని ఈఓఆర్డీ సభ దృష్టికి తెచ్చారు. ఎంపీటీసీలు, సర్పం చులు ఇళ్లస్థలాలు, బిల్లుల మంజూరుకు డబ్బులు అడుగుతున్నారని, గ్రామ సమస్యలపై రెవెన్యూ అధికారులను కలిసిన ప్రజాప్రతినిధులకు పనులు చేయకపోగా ఈసడించుకుంటున్నారని ఆరోపించారు. సమావే శానికి ఆర్‌అండ్‌బీ, విద్యుత్, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు గైర్హాజ రయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కల్పిస్తే ఊరుకోమన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రహదారులను వేశామని, పనులు పూరైన వెంటనే బిల్లులు సకాలంలో మంజూరు అవుతున్నాయని గౌరుచరిత తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాటనీల్లో అర్హతలేని వారికి పదుల సంఖ్యలో ఇళ్లు కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో ఎంపీడీఓ జి.నాగేశాచలరెడ్డి, తహసీల్దారు కె.ఆంజనేయులు అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలను గుర్తించండి

● పంట పెట్టుబడికి రుణాలు అందించండి ● కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారని, వారికి పంట రుణాలను అందించి తోడుగా నిలబడాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా వివిధ బ్యాంకుల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో డీసీసీబీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంకేతిక సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ మత్స్యశాఖ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలంటే బ్యాంకర్లు రుణాలను రైతులకు సక్రమంగా అందించాలన్నారు. ఎకరాకు ఖరీఫ్‌లో వరి పంటకు రూ.46వేల నుంచి రూ.50వేలు, జొన్న పంటకు రూ.22వేల నుంచి రూ.24వేలు, కొర్ర పంటకు రూ.15వేల నుంచి రూ.16 వేలు, కంది పంటకు రూ.22వేల నుంచి రూ.25వేలు, పెసరకు రూ.16 వేలు, కంది పంటకు రూ.22వేల నుంచి రూ.25వేలు నిర్ధారించారు. వేరుశనగ, పసుపు, మామిడి, జామకాయ, సపోట, టమోట, రోజాపూలు, కనకాంబరాలు, పుచ్చకాయ, ఆముదం, దానిమ్మ, బంతిపూలు తదితర ఉద్యాన పంటలకు కూడా నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జెర్సీ ఆవులు, గేదెలు, పొట్టేళ్లు, పౌల్ట్రీ అభివృద్ధికి సంబంధించిన దాణా, వెటర్నరీ ఎయిడ్‌కు మత్స్యశాఖకు సంబంధించి ఫిష్ కల్చర్, నెట్స్ తదితర అంశాలకు సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలను అందించాలన్నారు. ప్రతిపాదించిన రుణాల నివేదికను అనుమతుల కోసం రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీకి త్వరగా పంపాలని డీసీసీబీ బ్యాంకు సీఈవో విజయకుమార్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీసీబీ జనరల్ మేనేజర్ రామాంజనేయులు, ఎల్డీఎం రామచంద్రరావు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు, బ్యాంకర్లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వంక దాటుతూ 50 గొర్రెలు మృతి

● రూ. 8 లక్షలు నష్టం



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి

కోడుమూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి శివారులో ఓటుకుంట వాగు దాటుతూ ప్రమాదవశాత్తు 50 గొర్రెలు మృతి చెందాయి. కొండాపురం, లద్దగిరి గ్రామాలకు చెందిన గొర్రెల కాపరులు సుమారు 2 వేల గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. ఓటుకుంటవాగు పరిసరాల్లో కంది పొలాల కోత జరగడంతో మేతకు తరలించారు. అయితే మధ్యాహ్నం ఒక పొలం నుంచి మరొక పొలానికి వెళుతుండగా వాగు దాటాల్సి వచ్చింది. ఈ క్రమంలో ముందుగా దిగిన గొర్రెలు నీళ్లు తాగుతుండగా ఆ వెనుకనే వచ్చిన గొర్రెలు నీళ్లు తాగేవాటిపై పడ్డాయి. వెంటనే అప్రమత్తమైన కాపరులు గొర్రెలను అవతలి గట్టుకు లాగేశారు. అప్పటికే గొర్రెలు చనిపోయాయి. ప్రకాష్‌కు చెందిన 4 గొర్రెలు, బోయ మధు 16, చిన్నఓబులేష్ 1, భాస్కర్ 3, గొల్ల గోపాల్ 2, అయ్యస్వామి 9, బోయ గోపాల్ 4, ఉల్చాల మద్దిలేటి 2, కురువ గిడ్డయ్య 6, కురువ మధు 1, బోయ రంగడుకు చెందిన 2 గొర్రెలు మృతి చెందాయి. పశువైద్యాధికారి డాక్టర్ అమృత్‌రెడ్డి, వీఆర్వో శేఖన్న వచ్చి మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. ఈ ఘటనలో సుమారు రూ. 8 లక్షలు నష్టపోయామని గొర్రెల కాపరులు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

'ఉపాధ్యాయులను విస్మరిస్తున్న ప్రభుత్వం'

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి మరియానందం అన్నారు.. శుక్రవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తయినా మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లుల చెల్లింపు గానీ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్



ఎమ్మెల్యే దస్తగిరిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

కర్నూలు రూరల్ జనవరి 3(ఆంధ్రజ్యోతి): కోడుమూరు నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. గూడూరుకు చెందిన 18వ వార్డు వైసీపీ కౌన్సిలర్ కలామ్‌బాషాతో కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సమక్షంలో వారు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా కలామ్ బాషా మాట్లాడుతూ వైసీపీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు లేదని, విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై టీడీపీలో చేరినట్లు తెలిపారు. అనంతరం విష్ణు, దస్తగిరిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో గూడూరు టీడీపీ నాయకులు వైస్ ఛైర్మన్ రామాంజనేయులు, టౌన్ ప్రెసిడెంట్ గజేంద్రగోపాల్ నాయుడు, సృజన్, వెంకటేష్, కౌన్సిలర్లు పి.రామాంజనేయులు, ఆర్.సురేష్, పౌలు, వహీద్, చాంద్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి: సీపీఐ



మాట్లాడుతున్న గిడ్డయ్య

కర్నూలు న్యూసిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గౌరీగోపాల్ ఆసుపత్రి ఎదురుగా ధర్నా చౌక్‌లో నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ అధ్వర్యంలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగరంలో తాగునీటి శాశ్వత పరిష్కారానికి మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పి.రామక్రిష్టారెడ్డి, సహాయ కార్యదర్శులు సి.మహేష్, జి.చంద్ర శేఖర్, శ్రీనివాసరావు, గిడ్డమ్మ, శ్రావణి పాల్గొన్నారు.

'సమర్థులకే ఉపకులపతి పోస్టులు ఇవ్వాలి'

కర్నూలు అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో సమర్థులకే ఉపకులపతి పోస్టులు ఇవ్వాలని రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడలోని ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభు త్వ హయాంలో ఉన్నత విద్యామండలిలో జరిగిన అవినీతిపై విచారణ చేయాలని కోరారు. అదేవిధంగా పశుసంవర్ధక శాఖ, ఫిషరీస్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్‌ను మర్యాద పూర్వకంగా శ్రీరాములు కలిశారు.

కాంగ్రెస్‌లో చేరిక

కర్నూలు అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కోడుమూరు నియోజకవర్గంలోని సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన వైసీపీ, టీడీపీ నుంచి సుమారు 15 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. శుక్రవా రం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు ఆధ్వర్యంలో కండువా కప్పి వారిని ఆహ్వానించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, బజారన్న, లాజరస్ రమేష్, వాసు, మద్ది, భాస్కర్, రాముడు, పండు, కృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి 50వ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలు కర్నూలులో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూల్పూరి రంగారావు మెమోరియల్ కబడ్డీ పోటీలు శుక్రవారం రాత్రి నగర శివారు లోని డిడీపాడు కేఈ ప్రభాకర్ ఫామ్ హౌస్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 25 జట్లు పాల్గొన్నాయి. పోటీల నిర్వహక ఛైర్మన్ కేఈ ప్రభాకర్ అధ్యక్షతన జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, రాష్ట్ర ఒలింపిక్ ఛైర్మన్ పురుషోత్తం, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ శమంతకమణి, ఆర్జ రామకృష్ణ, రాష్ట్ర ప్రతినిధి వీరలంకయ్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, సుభాకర్ పాల్గొన్నారు.

'దళితుల భూములను కాపాడండి'

ఓర్వకల్లు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న దళితుల భూములను కాపాడాలని శుక్రవారం తహసీల్దార్ విద్యాసాగర్‌కు సీపీఐ మండల కార్యదర్శి రమేష్, రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్ వినతిపత్రం సమర్పించారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన 300బీ1 ఎకరా 50 సెంట్ల భూమి దళితులు సాగు చేసుకుంటుడగా.. ఆ భూమిని గ్రామానికి చెందిన కొం దరు వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



నృత్య పోటీల బ్రోచర్లు విడుదల చేస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మౌర్య ఇన్‌లోని ఆయన కార్యాలయంలో టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ప్రథమ వార్షికోత్సవం, నృత్యజ్యోతి అకాడమీ 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని నగర శివారులోని ఇండస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సౌత్ ఏషియా పీస్ కాన్ఫరెన్స్ ఇంటర్నేషనల్ యూత్ కల్చరల్ ఫెస్టివల్ బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఈనెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని సౌత్ ఏషియా ప్లస్ కాన్ఫరెన్స్, యూత్ కల్చరల్ ఫెస్టివల్‌ను ఈనెల 10 నుంచి 12 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులతో పాటూ విదేశాలకు చెందిన ప్రముఖులు హాజరవుతారన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు భార్గవ్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహి స్తున్న ఈ కార్యక్రమానికి టీజీ వెంకటేశ్ సహకారం మరువలేనిదన్నారు.

కంటి అద్దాలు పంపిణీ



మహిళలకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు హాస్పిటల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లోని శ్రీగురుదత్త పాలిక్లీనిక్‌లో గతంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న జర్నలిస్టులు, సమాచార శాఖకు చెందిన సిబ్బందికి సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి జబ్బులను ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేయించుకోవాలన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి: ఎంపీ

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలో ఆయన స్వగృహంలో కర్నూలు మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి పూలబొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే ధాన్యం క్రయ విక్రయాలు ప్రారంభిస్తున్నామని, జంబో షెడ్డు నిర్మాణంలో పెండింగ్ పనుల పూర్తికి సహకరించాలని ఎంపీకి సెక్రటరీ జయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మంలో అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివ న్న, నాగేష్, అకౌంటెంట్ కిషన్ రెడ్డి పాల్గొన్నారు.



ఎంపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న సెక్రటరీ జయలక్ష్మి

నేత్రదానంతో మరికొందరి జీవితాల్లో వెలుగులు



నేత్రదానం చేస్తున్న కుటుంబ సభ్యులకు ధృవీకరణ పత్రం అందజేస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటరమణ కాలనీలో మత్స్యశాఖ రిటైర్డు రీజనల్ డైరెక్టర్ నాగలింగారెడ్డి మృతి చెందారు. ఈ నేపథ్యంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ గోనూరు యుగంధర్ శెట్టి నేత్రదానంపై వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో కుటుంబ సభ్యులు వారి తండ్రి నేత్రా లను దానం చేసేందుకు అంగీకరించారు. వెంటనే ఈ విషయాన్ని రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులకు సమాచారం అందించగా.. వారు మృతుడి నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శోభన్‌బాబు, జిల్లా కన్వీనర్ మనోహర్ రెడ్డి, ప్రతి నిధులు తిరుపతి సాయి, నాగెళ్ల హరికిషన్, పోలెపల్లి శేషయ్య, జగదీష్, ఆనంద్, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సర్వేపల్లిలో కార్టూన్ కార్నివాల్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్‌లోని సర్వేపల్లి పాఠశాలలో కార్టూన్ కార్నివాల్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథులుగా పాఠశాల చైర్మన్ పి.శేషన్న, డైరెక్టర్ పి.దీక్షిత్‌లు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేపల్లి పాఠశాలలో చదివే విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా వారు చేసి ఆనందించే కార్టూన్‌సోలోని క్యారెక్టర్ తామే అయితే ఎలా ఉంటుందో చక్కగా చేసి చూపించారన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



ఆర్‌యూలో సావిత్రీబాయి పూలేకు నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీ ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, మౌలాలీ, రాజు, సికిందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

● క్లస్టర్ యూనివర్సిటీలో ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● స్థానిక ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి ఆధ్వర్యంలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చరిత్ర అధ్యాపకులు వెంకటస్వామి, వింధ్యావాసిని, నాగరత్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ జే హేమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

● కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ హాజరయ్యారు

కర్నూలు కలెక్టరేట్: సావిత్రీబాయి పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ అన్నారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధికార ప్రతినిధి సత్యన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, మహేష్, జగదీష్ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్న కుమార్, విజయశేఖర్, లక్ష్మి, సుజాత, మల్లేశ్వరుడు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఓర్వకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్‌వీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అలాగే ఎంఆర్‌సీ భవనంలో ఎంఈవో ఓంకార్ యాదవ్, ఉపాధ్యాయులు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జడ్పీటీసీ రంగనాథగౌడు, ఎంఈ వో ఓంకార్ యాదవ్, మహిళా హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షురాలు హనీషా పాషా హాజరై సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, బాలకృష్ణ నాయక్, ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్, మధు, ప్రసాద్, తిరుమలేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: నగరంలో సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక కర్షక భవన్‌లో ప్రజా సంఘాల అధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

తాగునీటి పథకానికి 15 ఎకరాల స్థల సేకరణ

పత్తికొండ, జనవరి3 (ఆంధ్రజ్యోతి): పల్లెపల్లెకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన జలధార మిషన్‌కు సంబంధించి 15 ఎకరాల స్థలసేకరణ పూర్తి చేసినట్లు ఆర్డీవో భరత్ నాయక్ తెలిపారు. గురువారం తహసీల్దార్ రమేష్, సర్వేయర్లు, వీఆర్వోలతో కలసి పందికోన రిజర్వాయర్‌ను పరిశీలించారు. పత్తికొండ డివిజన్ పరిధిలోని 9మండలాలకు జలధార మిషన్ కింద తాగునీటిని అందించేందుకు దూదేకొండ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్లు 460, 461లలో 15ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించడం జరిగిందన్నారు. పందికోన రిజర్వాయర్ ద్వారా నీటిని 15ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే మినీట్యాంకు మళ్లించి అక్కడి నుంచి పైప్‌లైన్‌గా మంచినీటి పథకాల ద్వారా నీటిని 9మండలాలకు తరలిస్తారన్నారు.

శనగ రైతులకు పరిహారం ఇవ్వాలి

మద్దికెర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్ ప్రభావం వల్ల పప్పుశనగ పంట తెగుళ్ల బారిన పడి పూర్తిగా దెబ్బతిందని, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, మండల రైతు సంఘం అధ్యక్షులు మదనంతపురం హనుమన్న, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కోదండరాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారి రవితో మాట్లాడుతూ మండలంలో 18వేల ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశారని అన్నారు. తుఫాన్ ప్రభావం వల్ల పప్పుశనగ పంటకు తెగుళ్ల సోకి పూర్తిగా ఎండిపోయి కుళ్లిపోవడంతో రైతులకు పంట చేతికి రాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పరిహారం ఇవ్వాలని కోరారు. ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని వాపోయారు. మండల వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నివేదికలు తయారు చేస్తున్నాం



రికార్డులు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మద్దికెర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడవలి గ్రామంలోని గొందె వెంగన్న చెరువుపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నివేదికలు తయారు చేస్తున్నామని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో చెరువులో పట్టాలు అన్న వార్తకు అధికారులు. స్పందించారు. తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రమాంజులు చెరువులో ఎలా పట్టాలు ఇచ్చారో అనే అంశంపై అడంగల్, 1బీ, ఆర్వోఆర్‌లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ 1997లో వారికి పాసు పుస్తకాలు ఇవ్వడం జరిగిందని, అయితే.. సమగ్ర విచారణ చేస్తున్నామని తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని అన్నారు.

50 ఏళ్ల తర్వాత సీసీ రోడ్డు



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న పంచాయతీ సభ్యుడు కవిరెడ్డి కృష్ణ

మద్దికెర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలోని కవిరెడ్డి పక్క వీధిన ఉన్న మద్దమ్మ దేవాలయం వద్ద నుంచి చింతల మాను మెయిన్ రోడ్డు వరకు 50 ఏళ్ల తర్వాత సీసీ రోడ్డు వేయనున్నారు. మండల నిధులు మంజూరు కావడంతో పంచాయతీరాజ్ ఏఈ విష్ణు, చంద్ర, పంచాయతీ సభ్యులు కవిరెడ్డి కృష్ణ శుక్రవారం భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ పనులను నాణ్యతతో చేపట్టి, త్వరలో పూర్తి చేస్తామని అన్నారు.

అందరికీ పనులు కల్పించాలి

తుగ్గలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రతి కూలికి పనులు కల్పించాలని ఏపీవో హేమసుందర్ అన్నారు. శుక్రవారం తుగ్గలి ఏపీవో కార్యాలయంలో ఆయన ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగుస్తున్నాయని, ముగిసిన గ్రామాల్లో కూలీలకు పనులు కల్పిస్తే వలసలు వెళ్లారన్నారు. ఒక రోజుకు ఒక్కొక్క కూలీకి వేతనం దాదాపు రూ.300లు వస్తుందని తెలియజేయాలన్నారు. సమావేశంలో ఈసీ ప్రదీప్ కుమార్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, జనవరి (ఆంధ్రజ్యోతి) 3: విద్యార్థులను బెత్తంతో బాదిన భాష్యం పాఠశాల హెచ్ఎంపై చర్యలు తీసుకొని పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, జిల్లా సమితి సభ్యుడు లింగప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం భాష్యం పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ అనవసరంగా విద్యార్థులను బెత్తంతో బాదడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు వీరవుసేని, రవి, బన్నీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వెల్దుర్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి గ్రామానికి చెందిన కమ్మరి రంగాచారి(23) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గురువారం కడుపునొప్పి భరించలేక విషం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం



కాలిపోతున్న గడ్డివాములు

హొళగుంద, జనవరి (ఆంధ్రజ్యోతి) 3: మండలంలోని హెబ్బటం గ్రామానికి చెందిన మాల కిష్టప్పతో పాటు మరో నలుగురికి చెందిన పది గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయని బాధితులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం గడ్డివాముల నుంచి దట్టమైన పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే మంటలు అధికం కావడంతో ఆలూరు, ఆదోని అగ్నిమాపక అధికారులకు ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. గడ్డివాములు విలువ సుమారు రూ. లక్షపైగా ఉంటుందని బాధితులు వాపోయాడు.

పని చేయని చేతి పంపులు

● మరమ్మతులకు నోచుకోని చేతిపంపులు ● ఇబ్బందుల్లో ప్రజలు



తుగ్గలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సాగునీరు అందించే చేతి పంపులు పని చేయడం లేదు. మరమ్మతులకు నోచుకోని నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. బోర్లలో నీరు పుష్కలంగా ఉన్నాయి. మరమ్మతులు చేయాలని అనేక సార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ప్రయోజనం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుగ్గలి మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో 55వేల జనాభా నివసిస్తున్నారు. వారికి తాగునీరు అందించేందుకు దాదాపు 150 చేతిపంపు బోర్లు ఉన్నాయి. అందులో కేవలం 90 మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన 60 చేతి పంపులు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో వాటిని మరమ్మతులు చేయకపోవడంతో మట్టితో కప్పేస్తున్నారు. ఇలా తాగునీరు అందించే బోర్లను అధికారులు పట్టించుకోపోతే ఎలా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్లను మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



పెండేకల్‌లో పని చేయని చేతి పంపులు



● **పైపులు మారిస్తే మంచినీరు వస్తుంది**



గతంలో తాగునీరు అందించే బోరు పైపులకు రంధ్రాలు పడటం వల్ల నీరు పైకి రాకుండా కిందకు పారుతుండడంతో నీరు రావడం లేదు. పైపులు మారిస్తే తాగునీరు వస్తుంది.

\- నవీన్, పెండేకల్

● **బోర్లు మరమ్మతులు చేయాలి**



భూగర్భంలో నుంచి వచ్చే బోరు నీరు ఎంతో స్వచ్ఛతగా ఉంటుంది. చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయకుండా వదిలేయడంతో స్వచ్ఛమైన నీరు అందడం లేదు. బోర్లను మరమ్మతులు చేసి తాగునీరు అందించాలి.

\- రవి, జొన్నగిరి

అందరికీ నాణ్యమైన విద్యను అందిస్తాం: ఎమ్మెల్యే



ఉత్తమ ఉపాధ్యాయురాలు కళ్యానిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అందరికీ నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం పత్తికొండ మండలం జెఎం తాండ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని పూలేకుపూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇద్దరు విద్యార్థులతో మూతపడే దశలో ఉన్న జెఎం తాండ పాఠశాలకు ఉపాధ్యాయురాలిగా వచ్చిన కళ్యాణి రూపురేఖలు మార్చేశారన్నారు. గ్రామంలో తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు ఆమె ఎంతో కష్టపడ్డారన్నారు. ఈ పాఠశాల నుంచి గురుకులం, నవోదయకు ప్రతిఏటా విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయురాలు కళ్యాణి సేవలు అందరికీ అదర్శనీయమని కొనియాడుతూ శాలువతో సత్కరించారు.

● నూతనసంవత్సరం సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన అభిమానులు పెన్నులు, నోటుపుస్తకాలు, మొక్కలు తీసుకురావాలని ఇచ్చిన పిలుపు మేరకు తనకు వచ్చిన పుస్తకాలు, పెన్నులకు జెఎంతాండ పాఠశాలకు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కేఈ తెలిపారు. ఉపాధ్యాయురాలు కళ్యాణికి వాటిని అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిన వెంకట్రాముడు, రామానాయుడు, సోమ్లానాయక్, బత్తినిలోక్‌నాథ్, వెంకటపతి, ఈశ్వరప్ప, బీటీ గోవిందు, ఎంఈవోలు వెంకట్‌రెడ్డి, రమేష్, ఉపాధ్యాయుడు నాగభూషణం తదితరులు ఉన్నారు.

నూతన సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు: ఆర్డీవో

పత్తికొండ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నూతన సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని పత్తికొండ ఆర్డీవో డాక్టరు భరత్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎస్టీయూ 2025 నూతన సంవత్సర కాలెండర్లు, దినసరి డైరీలు, గోడపత్రికను ఆర్డీవో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉత్తమ పౌరులను తీర్చిదిద్దిన్నప్పుడే మెరుగైన సమాజం ఏర్పడతుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, నారాయణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి రాంమోహన్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేకర్, బలరాముడు, నాయకులు వీరస్వామి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న సిబ్బంది

హాలహర్వి, జనవరి (ఆంధ్రజ్యోతి) 3: ఉపాధి హామీ పథకంలో కూలీలకు గిట్టుబాటు కూలీ, పనుల్లో నాణ్యత ఉండాలంటే మేట్‌లే కీలకమని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర కమిషనర్ ఆదేశాలు మేరకు ప్రతి గ్రామంలో 40 మంది కూలీలకు మేట్‌లను ఏర్పాటు చేయాలని వారి ద్వారా కొలతలు ప్రకారం పనులు జరిగేలా చూడాలని కోరారు. నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చక్రవర్తి, ఈసీ దేవదాస్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు..

ఉపాధి కూలీ మృతి



ఆంజనేయులు(ఫైల్)

ఆదోని రూరల్, జనవరి3 (ఆంధ్రజ్యోతి) : 9సంవత్సరాల క్రితం అనారోగ్యంతో భార్య మృతి చెందడంతో.. ఒక్కడే నలుగురు బిడ్డల కోసం రెక్కలు ముక్కలు చేసుకొని పని చేసే ఉపాధి కూలి శుక్రవారం గుండెపోటుతో పనిచేస్తున్న చోటనే కుప్పకూలి మరణించాడు. ఆదోని మండలం పాండవగల్లు గ్రామానికి చెందిన ఆంజనేయులు(42) శుక్రవారం ఉపాధి పనులకు గ్రామస్థులతో కలిసి వెళ్లాడు. పని చేస్తున్న సమయంలో ఒక్కసారిగా గుండెనొప్పి వచ్చి కుప్పకూలిపోయాడు. కూలీలు ఆయనను ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆంజనేయులు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆంజనేయ మృతితో నలుగురు బిడ్డలు అనాథలయ్యారు. ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఏపీఓ సూర్యప్రకాష్ అంజనేయ మృత దేహానికి నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయాన్ని అందజేస్తామన్నారు.

డీఐజీని కలిసిన వైకుంఠం దంపతులు



డీఐజీ శుభాకాంక్షలు తెలుపుతున్న వైకుంఠం శివప్రసాద్, జ్యోతి దంపతులు

ఆలూరు, జనవరి 3: కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళ నాయకులు వైకుంఠం జ్యోతి కలిసి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలు వంటి అంశాలపై చర్చించామని వారు తెలిపారు.

జిల్లా అధికారులను కలిసిన ఎమ్మెల్యే



కలెక్టర్, ఎస్పీలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు గురువారం కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీన్, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందుమాదవ్‌లను కలసి నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. కర్నూలులో కార్యాలయాల్లో వారిని కలిసిన కేఈ నియోజకవర్గ అభివృద్ధికి, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై చర్చించారు.

ఘనంగా మస్తానయ్య స్వామి ఉరుసు

తుగ్గలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కోర్కెలు తీర్చే మస్తానయ్య స్వామి ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జి.ఎర్రగుడిలో మస్తానయ్య స్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా భక్తులు దర్గాకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, జిట్టా నగేష్ యాదవ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ జిట్టా వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

మున్సిపల్ చైర్మన్ పదవి మస్లింలకు కేటాయించాలి



మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

ఆదోని టౌన్, జనవరి 3: వచ్చే మున్సిపల్ ఎన్నికలలో ఆదోని మునిసిపల్ చైర్మన్ పదవిని మైనారిటీలకు కేటాయించాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కార్యాలయంలో నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నాయకులు మాట్లాడుతూ ఆదోని మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని బీసీ మైనార్టీ వర్గానికి రిజర్వ్ చేయడం తాము స్వాగతిస్తున్నామన్నారు. మైనారిటీలకు మరింత సేవలు అందించేందుకు మున్సిపల్ చైర్మన్ పదవి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ నూర్ అహ్మద్, కో కన్వీనర్ ఎండీ నూర్, హెచ్ఆర్ఎఫ్ నాయకులు ఖాదర్, బాషా, ఎంఐఎం నాయకులు జునైద్, నాసిర్, ఎస్‌డీపీఐ నాయకులు సద్దాం హుస్సేన్ న్యాయవాది మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రజలకు వైద్యసేవలు అందించాలి

● జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకప్ప

ఆలూరు, జనవరి 3: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు వైద్యులు, సిబ్బంది అందించాలని జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. శుక్రవారం ఆలూరు ప్రభుత్వం ఆసుపత్రిను ఆయన సందర్శించారు. గత ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో అన్ని వసతులు మిషనరీలతో నూతన భవనాన్ని ఎందుకు ఆరంభించలేదని ప్రశ్నించారు. ప్రతిరోజు పేషెంట్లు వివిధ గ్రామాల నుంచి వైద్యం కోసం వస్తుంటారని, వారికి అన్ని విధాలుగా వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన బోధన అందేలా చూడాలన్నారు. ఆయన వెంట నాయకులు చత్రపతి, మున్న, యశోధ, భాష, మహేష్, రంగ స్వామి పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

ఆదోని టౌన్, జనవరి 3: విజయవాడలో ఐదో తేదీన జరిగే హైందవ శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని హిందుస్థాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజినేయులు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈ శంఖారావానికి ఆదోని నుంచి దాదాపు 80 వాహనాల్లో శనివారం బయలుదేరనున్నారని తెలిపారు. అయితే రామాంజినేయులు, ఆయన బృందం ప్రత్యేక వాహనంలో శుక్రవారం సాయంత్రం మాత్రమే విజయవాడకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసన్న గౌడ్, తదితరులు ఉన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్లకు పాఠశాల అభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ పర్సన్ సురేంద్ర బాపూజీ, ఆర్పీలో మునీర్, మల్లికార్జున, జగదీష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్సీ

ఆదోని అగ్రికల్చర్, జనవరి 3: ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్సీ బీటీ నాయకుడు పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ బీటీ నాయకులు స్వగహంలో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. ఉపాధ్యాయులకు సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీను నెరవేరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ నాయుడు, వీరచంద్ర యాదవ్, లోక్య నాయక్, ప్రహ్లాద, శ్రీనివాసులు, నరసింహులు, నాగప్రసాద్ రవి, భీమ్రాజ్, సుధాకర్ ఉరుకుందప్ప, అల్తాఫ్, శ్రీరాములు, నారాయణ జ్యోతి మూర్తి పాల్గొన్నారు.

నగదు అపహరణ

దేవనకొండ,జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేవనకొండలోని చాకలి వీధికి చెందిన హనుమంతు ఇంట్లో గురువారం చోరీ జరిగింది. పగలు వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటి కొచ్చాక బీరువా తెరచి వుండటం కుటుంబసభ్యులు గమనించారు. బీరువలో దాచిన రూ.50 వేల నగదు, ఒకజత కమ్మలు చోరీ అయ్యాయని గ్రహించిన హనుమంతు పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

దివ్యాంగుడికి ఎస్ఐ చేయూత



ఆర్థికసాయం ఇస్తున్న ఎస్ఐ

ఆలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండల హత్తిబేలగల్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు గోరంట్లకు శుక్రవారం ఆలూరు ఎస్ఐ చేయూత అందించారు. బ్యాంక్ కోచింగ్ కోసం ప్రోత్సహిస్తూ అవసరం అయ్యే ఖర్చు కోసం నగదు అందజేశారు. దివ్యాంగులు నిరుత్సాహ పడకుండా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఎస్ఐ సూచించారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



తుంబలబీడు ప్రాథమిక పాఠశాలలో సావిత్రీ బాయి చిత్ర పటానికి పూల మాల వేస్తున్న ఉపాధ్యాయులు



తెర్నేకల్ జడ్పీ పాఠశాలలో...



పత్తికొండలో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం



మద్దికెరలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి3(ఆంధ్రజ్యోతి): చదువుల తల్లి సావిత్రి బాయి పూలే నేటి విద్యార్థినులకు మహిళలకు ఆదర్శమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నేషనల్ జూనియర్ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆమె చిత్రపటానికి విద్యార్థులు పూలమాలవేసి నివాళులర్పించారు.

● బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక మంగళ ఆంజనేయ స్వామి దేవాలయంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు దేవ పూజ ధనుంజయచారి ఉపాధ్యక్షుడు దస్తగిరి, సాయి బాబా, ఫక్రుద్దీన్, శిక్షావలి దేవి శెట్టి ప్రకాష్, సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పత్తికొండ: సావిత్రీబాయిపూలే జయంతి కార్యక్రమాలు పత్తికొండలో గురువారం ఘనంగా నిర్వహించారు. డిగ్రీకళాశాలలో వైస్‌ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భవితపాఠశాలలో ప్రత్యేక అవసరాల పిల్లల సమక్షంలో మైత్రిచారిటబుల్ ట్రస్టు అదినేత రామ్మోహన్ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.

మద్దికెర: సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు మద్దికెరలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక కస్తూర్బా పాఠశాల, విద్యాసాయి కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రంగస్వామి, విద్యాసాయి కళాశాల ప్రిన్సిపాల్ బాల సునీత, ప్రిన్సపాల్ జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

తుగ్గలి: సావిత్రీబాయి పూలే సేవలు మరువలేనివని ఎంఈవో రమావెంకటేశ్ గౌడు అన్నారు. శుక్రవారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి, తదితర గ్రామాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలను పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాబురావు, షాహీన్, ఉపేంద్ర, చందు నాయక్, పాండు రంగరాజు, విద్యాకమిటీ చైర్మన్ రవి యాదవ్, తదితరులు ఉన్నారు.

పత్తికొండ టౌన్: పత్తికొండ పట్టణంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. 144వ జయంతిని పురస్కరించుకుని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన పది మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భ్రమరాంబ, రిటైర్డు ఎంఈవో సుశీల, మాజీ సర్పంచ్ సోమశేఖర్, రాతన సర్పంచ్ రాచప్ప, పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ జడ్పీ పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. అమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి ఆర్పించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రోషన్న, మహిళ ఉపాధ్యాయులు హెబ్సిబి, హేమలత,ప్రమీల,అనిల్,వెంకటేష్ ు పాల్గొన్నారు.



ఆదోనిలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న విద్యార్థులు

ఆలూరు: ఆలూరు మండలంలోని తుంబలబీడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయులు నాగరాజు, రమణారెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్

● రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు
● ఇబ్బందుల్లో కాలనీ వాసులు



సంజీవయ్య కాలనీలో పైకప్పులేని మ్యాన్‌హోల్

ఎమ్మిగనూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు నోళ్లతెరిచాయి. దీంతో ఆయా ప్రాంతాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 15ఏళ్ల క్రితం కోట్ల రూపాయలతో పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మిగనూరు పట్టణంలో 122 కి.మీ యూజీడీ పైపులైన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పట్టణ మొత్తంపైన దాదాపు 7500 మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేశారు. అయితే ఆ పనులు ఇంకా కొంతమేర అసంపూర్తిగా ఉన్నాయి. పూర్తయిన పనులకు సంబంధించి నిర్వహణ లేకపోవడం, పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మ్యాన్‌హోళ్ల పైకప్పులు లేచిపోవడంతో పాటు మ్యాన్‌హోళ్ల కిందికి కుంగిపోయాయి. కొన్ని చోట్ల మ్యాన్‌హోళ్లు పూర్తిగా కనిపించకుండ పోయాయి. అక్కడక్కడ పైపులైన్ నుంచి మురుగు నీరు వెళ్తున్నప్పటికి కొన్ని చోట్ల మ్యాన్‌హోళ్లకు పైకప్పులు లేకపోవడంతో మురుగునీరు కాస్తా రోడ్డుపైకి ఉబికి వస్తుంది. పట్టణంలోని ఈద్గా రోడ్డులో రెండు చోట్ల యూజీడీ పైపులు బ్లాక్ కావడంతో మ్యాన్ హోల్స్‌పై నుంచి మురుగునీరు పైకి వస్తుంది. దీంతో ఆప్రాంతంలో ఉన్న ప్రజలు మురుగు కంపుతో తీవ్ర ఇబ్బందులకు గురతున్నారు. అలాగే హనుమాన్‌నగర్‌లో మ్యాన్‌హోళ్ల పైకప్పులు రోజులు తరబడి ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులే వాటిపైన బండలు, రాళ్లు పెట్టుకొని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే సంజీవయ్యనగర్‌లో గుడికి సమీపంలో ఓ మ్యాన్‌హోల్ పూర్తిగా మట్టితో కూరుకుపోవడంతో గుంతగా మారింది. దీంతో అక్కడి ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. గతకొన్ని రోజుల క్రితం ఈ మ్యాన్‌హోల్‌లో పడి చిన్నారులకు గాయాలైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే ఎద్దుల మార్కెట్ సమీపంలో సైతం మ్యాన్‌హోల్ రూపురేఖలే మారిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూజీడీ పైపులైన్లలో సక్రమంగా నీరు వెళ్లేలా ఏర్పాటు చేయడంతో పాటు నోళ్లు తెరచిన మ్యాన్‌హోళ్లకు పైకప్పులు ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.




హనుమాన్‌నగర్‌లో మ్యాన్‌హోల్‌పై పెట్టిన బండలు, ఈద్గారోడ్డులో ...

మ్యాన్‌హోళ్లకు పైకప్పులు ఏర్పాటు చేయాలి



పట్టణంలో యూజీడీ పనుల్లో భాగంగా మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేసి వాటికి పైకప్పులు ఏర్పాటు చేయడం మరిచారు. పైకప్పులను వెంటనే ఏర్పాటు చేయాలి. మురుగునీరు రోడ్లపైకి రావడంతో పాటు మురుగు దుర్వాసనకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు మ్యాన్ హోళ్లపై ప్రత్యేక దృష్టి సారించి మ్యాన్‌హోళ్లకు పైకప్పులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి.

- రాముడు, సీపీఎం నాయకులు, ఎమ్మిగనూరు

ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ



ఆలయాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

కోసిగి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐదేళ్ల తర్వాత జరగనున్న మారెమ్మ దేవర ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. శుక్రవారం కోసిగిలోని స్థానిక సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్, ఆధ్వర్యంలో కోసిగి సర్కిల్ కార్యాలయంలో గతంలో దేవర ఉత్సవాల్లో జరిగిన సంఘటనల గురించి పోలీసుల రికార్డులను పరిశీలించారు. అనంతరం కోసిగిలోని 3వ వార్డులోని కింది మారెమ్మ దేవాలయం, 4వ వార్డులోని ముసలి మారెమ్మ దేవాలయం, సిద్దప్పపాలెం మారెమ్మ దేవాలయం, ఎస్సీ కాలనీలోని మారెమ్మ దేవాలయాలను డీఎస్పీ పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం దేవర ఉత్సవలకు లక్షకు పైగా భక్తులు హాజరవుతున్నట్లు తెలుస్తుందని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పూర్ణకుంభాలు భక్తులతో వచ్చే సమయంలో రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, ఆలయాల సమీపంలో పురాతన ఇళ్లు కలిగిన వారికి పలు సూచనలు చేయాలని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దేవరకు 150 మందికి పైగా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కోసిగి, మంత్రాలయం సీఐలు మంజునాథ్, రామాంజులు, ఎస్ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో పొరపాట్లు జరగరాదు



గోదాములో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

ఎమ్మిగనూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను సబ్‌కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ ఆదేశించారు. శుక్రవారం మంత్రాలయం రోడ్డులో ఉన్న పౌరసరఫరా గోదామును సబ్‌కలెక్టర్ పరిశీలించారు. గోదాములో ఉన్న బియ్యం, చెక్కెరతో పాటు ఇతర రేషన్ నిల్వలను, రికార్డులను పరిశీలించారు. రేషన్ నిల్వల భద్రత గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్‌కార్డుదారులందరికి రేషన్ అందేలా చూడాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శేషఫణి, గోడౌన్ డీటీ మహేష్, ఆర్ఐ లక్ష్మన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పని వేళలు పాటించకపోతే ఎలా?

● అధికారులపై ఎంపీపీ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఓ సారి జరిగే మండల సమావేశానికి అధికారులు సమయ పాలన పాటించకపోతే ఎలా అని ఎంపీపీ శ్రీవిద్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దకడబూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా గత నెలలో అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీపీ హనుమంతు రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశ నియమ నిబంధనలు గాలికొదిలేశారని, అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం హనుమాపురం ఎంపీటీసీ నరవ శశిరేఖ మాట్లాడుతూ గత సర్వసభ్య సమావేశంలో తెలిపిన సమస్యలు నేటికి పరిష్కరించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు అడిగినా సమస్యలు పరిష్కారం చేయకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. హెచ్ మురవణి ఎంపీటీసీ బేబి మాట్లాడుతూ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అందించే గుడ్లు, పాల ప్యాకెట్లను కార్యకర్తలు బయట వ్యక్తులకు అమ్ముకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో అనాధికార వ్యక్తులు పాల్గొన్న అధికారులు ప్రశ్నించకపోవడం గమనార్హం. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనాథ్, ఎంపీడీవో జయరాముడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు రామాంజినేయులు, చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ డివిజన్ నాయకులు గోవిందు, రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపాల్ కమిషనర్ గంగిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులుగా పని చేస్తూ పలువురు అనారోగ్యం, కరోనా వల్ల మృత్యువాత పడ్డారన్నారు. 2019కు ముందు మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు అప్పటి అధికారులు ఉపాధి కల్పించేవారన్నారు. అయితే 2019లో జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత అప్కాస్ పెట్టి కార్మికులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. నాయకులు నాగరాజు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఘనంగా సుంకులమ్మ ఆలయం ప్రారంభం

కోసిగి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ఒకటో వార్డులోని రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయం సమీపంలో సుంకులమ్మ దేవి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలతోపాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు పీఎస్ సుందర్‌రాజు దొర, కోసిగి ధరల వంశస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి ఆలయంలో హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పండితులు శ్రీవైష్ణవ పంచరాత్ర ఆగమ అనిల్‌కుమార్ స్వామి, యశ్వంత్ స్వామి, గోవర్ధన్ స్వామి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, వైసీపీ నాయకులు మురళి రెడ్డి, ఎంపీపీ ఈరన్న, నాడిగేని నాగరాజు, మాణిక్యరాజు, సిద్దప్పపాలెం గ్రామ పెద్దలు హోళగుంద కోసిగయ్య, తిమ్మయ్య, బ్రహ్మయ్య ఆచారి, దళవాయి భీమయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

మంచాలమ్మకు పంచామృతాభిషేకం

మంత్రాలయం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. శుక్రవారం ధనుర్మాసం చవితి ను పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు చీర, బంగారు, వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

మహిళలకు రక్షణ కరువు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని వైసీపీ సీనియర్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గురుకుల కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బాలికలు చదువుతున్న కళాశాలల్లో రక్షణ కల్పించ లేకపోతున్నారన్నారు. గురుకుల పాఠశాల, నవోదయ, బాలికల పాఠశాలలు, కళాశాలల దగ్గర ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. కళాశాలలో మహిళా లెక్చరర్లను నియమించాలన్నారు. అలాగే విద్యార్థినిని లైంగికంగా వేధించిన లైబ్రేరియన్‌ను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, ఎంపీపీ కేశన్న, నాయకులు బుట్టారంగయ్య, సోగనూరు భీమిరెడ్డి, రియాజ్, మాచాని వెంకటేష్, విశ్వనాథ్, కేశవరెడ్డి, మురహరి, సుధాకర్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ముగ్గురి అరెస్టు

మంత్రాలయం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన నాగరాజు, ఈరన్న, నగేష్ అనే వ్యక్తులు కర్ణాటక మద్యం అమ్ముతుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్ శుక్రవారం తెలిపారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మంత్రాలయం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులకు ఉపాధ్యాయులు నగదును అందించారు. గ్రామానికి చెందిన మజ్జిగ నాగేంద్ర అనే వ్యక్తి గత నెల 22న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి నలుగురు పిల్లలు అదే పాఠశాలలో చదువుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయులు రత్నకుమారి, వెంకటస్వామి, ఈరన్న, రాంప్రసాద్, ఇబ్రహీం, శ్రీనివాసులు, హనుమంతు, శ్యామలత, శ్రీదేవి బాధిత ఇంటికి వెళ్లి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందించిన ఉపాధ్యాయులకు గ్రామస్థులు అభినందించారు.

'తప్పుదోవ పడుతున్న యువత'



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు

గోనెగండ్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం యువత, విద్యార్థులు సోషల్ మీడియా, డ్రగ్స్‌లకు బానిసలుగా మారి తప్పుదోవ పడుతున్నారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ షహనా పర్విన్, చిన్నమరివీడు ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలత అన్నారు. శుక్రవారం గోనెగండ్లలోని మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ సంఘం ఆధ్వర్యంలో సోషల్ మీడియా, డ్రగ్స్‌ప్రభావం విద్యార్థుల కర్తవ్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బాబు, సాయిఉదయ్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, వినయ్, ఓంకార్, బాబు, ప్రసాద్, దండుఖాజా, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

గోనెగండ్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): భూ సర్వేలలోని పొరపాట్లను సరిచేసేందుకు, రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. శుక్రవారం మండల మండల పరిధిలోని లింగందిన్నెలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'మహిళలపై అఘాయిత్యాలను అరికడదాం'

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సావిత్రీబాయి స్ఫూర్తితో మహిళలపై అఘాయిత్యాలను అరికడదామని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బనవాసి గురుకుల కళాశాలలో శుక్రవారం ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయ కులు రెండు రోజుల క్రితం జరిగిన సంఘటనపై విద్యార్థినులతో మాట్లాడారు. అలాగే సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పద్మ, శ్యామల, ఎస్ఎఫ్ఐ నాయ కులు రాము, విల్సన్, కరుణాకర్ పాల్గొన్నారు.

పొట్టేళ్లను ఎత్తుకెళ్లిన దొంగలు

కోసిగి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో ఆదోని రోడ్డు పొలంలో ఉన్న తాళం వేసి ఉన్న ఓ గుడిసెలో కోసిగి 1వ వార్డుకు చెందిన వక్రాణి వెంకటేశ్, ఈరన్నలకు చెందిన సుమారు రూ.50వేలు విలువ చేసే రెండు పొట్టేళ్లను గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు తాళాలు పగులకొట్టి పొట్టేళ్లను ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు వక్రాణి వెంకటేశ్, ఈరన్న తెలిపారు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం పొలంలో ఉన్న కొట్టానికి ఉన్న తాళాలు పగులకొట్టి ఉండటం గమనించి తెరిచి చూస్తే రెండు పొట్టేళ్లు కనిపించకపోవడంతో పక్కనే పొలంలో తాగి పడేసిన రెండు మద్యం సీసాలు ఉండటంతో కోసిగి పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతులు ఎస్ఐ చంద్రమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవలలో కోసిగిలో పందులు, పొట్టేళ్ల దొంగతనాలు తరచూ జరుగుతున్నాయి. గత 15 రోజుల క్రితం ఇంటి ముందు కట్టేసిన పొట్టేళ్లను దొంగలు ఎత్తుకెళ్లారు. దేవర సందర్భంగా ప్రతి ఇంటి ముందు పొట్టేళ్లు ఉండటంతో అదనుగా భావించిన దొంగలు రాత్రివేళల్లో వచ్చి పొట్టేళ్లను ఎత్తుకెళ్తున్నారు. ఎస్ఐ చంద్రమోహన్‌ను వివరణ కోరగా.. పొట్టేళ్ల దొంగతనంపై కేసు నమోదు చేసి త్వరలో దొంగలను పట్టుకుంటామని తెలిపారు

'ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ఇవ్వాలి'

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, అబ్దుల్, ఖాదర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడారు. సమావేశంలో సమీర్, వీరేష్, సంతోష్, ప్రవీణ్, మోహన్, రవి పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో రావూస్ విద్యార్థుల ప్రతిభ

ఎమ్మిగనూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు డిగ్రీ ద్వితీయ, నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. డిగ్రీ నాల్గవ సెమిస్టర్‌లో ఎంఎస్‌సీఎస్ గ్రూపులో దివ్యశ్రీనివాణి 9.60, అఖిల 9.41, శ్రేయ 9.12 పాయింట్లు సాధించారు. అలాగే ఎంపీసీఎస్‌లో ఫైరోజా 9.08, దివ్య 9.00, బీజెడ్‌సీ గ్రూపులో అఖిల 8.85, తస్లిమ 8.82, అరుణ 8.22, బీకాంలో సహిద 8.22, రాధా 8.12, యు.యం జ్యోతి 7.96 పాయింట్లు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం సెమిస్టర్‌లో బీఎస్సీ హానర్స్‌స్టాటస్టిక్స్ గ్రూపులో సుకన్య 8.65, స్వప్న 8.27, కంప్యూటర్స్ గ్రూపులో ఆఫ్రీన్‌బాను 8.15, జి.షైఫ్ 8.09, రేష్మా 8.03, బీఎస్సీ హానర్స్‌లో ఫిజిక్స్ గ్రూపులో మానస 8.02, మ్యాస్‌లో థైసిన్ 7.89, బోటనీలో ఐషాసిద్దిక 8.8, నస్రిన్‌బేగం 8.57, ఉషా 8.49, జువాలజీలో మధుమతి 8.7, పవనశ్రీ 8.57, సతీష్ 8.39, బీకాంలో నిహర్షిత 8.43 పాయింట్లు సాధించారు.

క్రీడాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పెద్దకడబూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలల్లోనే క్రీడాభివృద్ధికి నిధులు కేటాయించి క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుందని టీడీపీ నాయకులు బొగ్గుల నరసన్న, తిక్కన్న, గుమ్మల ఆశన్న అన్నారు. శుక్రవారం పెద్దకడబూరులో వారు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో మాట్లాడారు. నాయకులు సుధాకర్, దినకర్, బుడ్డన్న, ఆదామ్ పాల్గొన్నారు.

విద్యార్థినులు ధైర్యంగా ఉండాలి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ధైర్యంగా ఉండి చదువు కోవాలని రూరల్ సీఐ బీవీ మధుసూదన్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని బనవాసి గురుకుల కళాశాలలో విద్యార్థినులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి




ఎమ్మిగనూరులో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, మంత్రాలయంలో..

ఎమ్మిగనూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణం, ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌టీఆర్ కాలనీల్లోని ఎంపీపీఎస్, డీపీఈపీ పాఠశాలల్లో, బైపాస్ రోడ్డులోని కౌన్సిలర్ ఇంటి దగ్గర, కేవీపీఎస్ కార్యాలయంతో పాటు ఆయా కళాశాలలు, పాఠశాలలు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు నాగమణి, శాంతిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఎంఈవో-1 ఆంజనేయులు ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు కళావతిని ఎంఈవో-1 ఆంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, భాస్కర్, వీరేషులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మిగనూరు పట్టణంలోని పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే చిత్రపటానికి మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, నిర్వాహకులు నరసన్న, ప్రతిభా భారతి, నాగరాజు, యువరాజు, మహానంది పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను సన్మానిం చారు.

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. పూలే, సావిత్రీ బాయి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, దండుఖాజా , సంఘం నాయకులు కాటికాపరుల సంఘం నాయకుడు మల్లికార్జున, గంమారేష్, రంగన్న, నరసింహులు, తిమ్మప్ప, సూరి, మస్తాన్, నాగేష్, ఈరన్న, ఉరుకుంద, వీరేష్, ఆదాం, రాజు, యశోద, సుశీలమ్మ, నరసింహగౌగ్ పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో : మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలో ఉన్న మోడల్‌స్కూల్‌లో, చిన్నమరివీడు గ్రామ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. మోడల్ స్కూల్‌లోని పూలే విగ్రహాలకు పూల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షహనా పర్విన్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళం: కౌతాళం ప్రతిభ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయురాళ్లను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శిరీష, జయలక్ష్మి, ముంతాజ్ ఉన్నారు.

మంత్రాలయం: మండలంలోని చిలకలడోన కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపాల్ శాంతి అధ్యక్షతన సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్, నాయకులు విజయుడు, భ్రమరాంబ, లక్ష్మీదేవి, కృష్ణవేణి, భాగ్య విద్యార్థినులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు



సిరాలదొడ్డిలో..



కౌతాళంలో..

సీజనల్ పనుల గుర్తింపునకు చర్యలు

గోనెగండ్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకుగాను 2025-26 సంవత్సరానికి జరుగు పనులను గుర్తించేందుకు గాను మ్యాప్‌ను తయారు చేసి పరిశీలిస్తున్నట్లు మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, టీఏ ఫారుక్ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని చెత్త సంపద కేంద్రం వద్ద ఉపాధిహామీ పనులకు గాను ఈ ఏడాది ఎన్ని పనులు గుర్తించాలి, ఏ ప్రాంతంలో పనులు చేపట్టాలి, ఆ పనులను ఏ నెలలో ఎంతమంది కూలీలు హాజరవుతారనే విషయాలను తెలిపే మ్యాప్‌ను టీఏ ఫారుక్ ఏర్పాటు చేశారు. ఆ మ్యాప్‌ను అధికారులు పరిశీలించారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా ఏ నెలలో ఎన్ని పనులు చేపట్టాలో చర్చించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో జగ్గాపురం టాప్

నందవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో నందవరం మండలంలోనే హలహర్వి మజరా గ్రామమైన జగ్గాపురం టాప్‌గా నిలిచింది. శుక్రవారం 418 మంది కార్యకర్తలతో సభ్యత్వం నమోదు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎంపీటీసీ గడంగం నరసింహులు, గట్టాల రంగన్న, ఎల్ఐసీ గోపాల్, తిమ్మప్ప, ఈరన్న, దస్తగిరి, మాజీ ఎంపీటీసీ లక్ష్మదేవి, ఆటో ఈరన్న, వీరేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.